క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన స్కూల్ బ్యాగులు



బ్యాగులను పరిశీలిస్తున్న ఎంఈఓ దాలినాయుడు

నరసన్నపేట: మండలంలో 83 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా స్థానిక ఎమ్మార్సీకి 2,683 స్కూల్ బ్యాగులు వచ్చాయని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు గురువారం తెలిపారు. ఈ బ్యాగులు జూన్ మొదటి వారంలో ఆయా స్కూళ్లకు సరఫరా చేస్తామన్నారు. స్కూల్స్ ప్రారంభం రోజున పుస్తకాలతోపాటు బ్యాగులు అందిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు

హిరమండలం: నిత్య జీవితంలో యోగా భాగం కావాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, ఏపీఓ శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ గోవిందరావు, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి చేరిన యూనిఫాం



యూనిఫాంను సర్దుబాటు చేస్తున్న సిబ్బంది

హిరమండలం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు గురువారం మండల కేంద్రానికి చేరినట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. వచ్చిన యూనిఫాం కిట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా పాఠశాలలకు తరలించేందుకు ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జూన్ మొదటి వారంలో అన్ని పాఠశాలలకు పుస్తకాలతోపాటు యూనిఫాం అందించడం జరుగుతుందన్నారు. 8 ఏళ్లు పూర్తిచేసిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వీఆర్వో పోస్టును కొనసాగించాలని వినతి

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 7వ వార్డు చింతాడ సచివాలయ రెవెన్యూ పరిధిలోని వీఆర్వో పోస్టును కొనసాగించాలని 12 గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు గురువారం ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్-4 ద్వారా సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రకారం ఆమదాలవలస మున్సిపాలిటీ, శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడ రెవెన్యూ పరిధిలో ఉన్న 12 గ్రామాలను సచివాలయ నంబర్ 6, ఎస్సీ కాలనీ-1 సచివాలయాన్ని ఆమదాలవలస మున్సిపల్ అధికారులు సీ కేటగిరి కింద ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్ఓ పోస్టును రేషనలైజేషన్ కింద సచివాలయం నంబర్-8 వీఆర్ఓను ఇక్కడ కేటాయించారన్నారు. వెంగళరావు కాలనీలో పనిచేసే వీఆర్ఓ రెండు సచివాలయాల్లో పని చేయాల్సి వస్తోందని, ఆయనకు పని భారం అవుతుందని, ఏ ఒక్క రైతుకు కూడా సక్రమంగా సేవలు అందవన్నారు. చింతాడ రెవెన్యూ పరిధిలో వీఆర్వో సేవలు అవసరమన్నారు. ఈ రెవెన్యూ పరిధిలో సుమారు 12 గ్రామాల్లో 2,200 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని, సుమారు 1,900 మంది వరకు రైతులు ఉన్నారన్నారు. వెంగళరావు కాలనీ పట్టణ పరిధిలో ఉందని, తక్కువ మంది రైతులున్న సచివాలయంలో వీఆర్వో సేవలు కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గమనించి చింతాడ రెవెన్యూ పరిధిలోని సచివాలయంలో వీఆర్ఓ పోస్టును కొనసాగించాలన్నారు.

స్కిల్ హబ్‌లో కంప్యూటర్ శిక్షణ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు వినియోగించుకోవాలని జిల్లా అధికారి ఉరిటి సాయి కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. పదో తరగతి, ఆపై చదువుకున్న నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నంబర్ 99499 00672ను సంప్రదించాలన్నారు.

పనిచేయని సర్వర్..!



నరసన్నపేట సచివాలయంలో ఈకేవైసీ కోసం వేచి ఉన్న దరఖాస్తుదారులు

- రేషన్‌కార్డు దరఖాస్తుదారుల అవస్థలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయల వద్ద పడిగాపులు..
- స్పందించని ప్రభుత్వం

నరసన్నపేట: రేషన్‌కార్డులు ఇచ్చేస్తున్నాం.. ఇక మీదే ఆలస్యమని గొప్పగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. కొత్త కార్డులు కావాలన్నా.. పేర్లు మార్పు కోవాలన్నా.. యూనిట్లు యాడ్ చేసుకోవాలన్నా.. సచివాలయానికి, మీ సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మాత్రం రోజురోజుకీ సమస్యలు పెరగడం, ప్రధానంగా సర్వర్ సమస్య తీవ్రంగా మారడంతో దరఖాస్తుదారులు విసిగిపోతున్నారు. రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా దరఖాస్తులు అప్‌లోడ్ కావడం లేదు. నరసన్నపేట మండలంలో ఇప్పటివరకు 780 దరఖాస్తులు వచ్చాయి. పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో కలిపి సుమారు 1,300 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల్లో పేర్లు చేర్పులు, మార్పులు, కొత్త కార్డులు మంజూరు, యూనిట్ల పెంపు వంటి ప్రక్రియ నిరంతరంగా ఉండేది. కొన్ని గంటల్లో రేషన్ కార్డులు మంజూరు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆ రోజులను దరఖాస్తుదారులు గుర్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత సమయంలో కార్డులు మంజూరవుతాయని మంత్రులు, అధికారులు అంటున్నా.. ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా.. సర్వర్ సమస్య పరిష్కరించలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు మానుకొని నిరీక్షిస్తున్నా.. మళ్లీ మరసటి రోజు కూడా వెళ్లాల్సిన పరిస్థితి.

వెంటాడుతున్న ఇబ్బందులు..

పేర్లు యాడింగ్, కొత్తగా వివాహం జరిగినవారు కార్డుల విభజన కోరుతూ సచివాలయాలకు వెళ్తే సర్వర్ మొరాయిస్తోంది. ఇంటర్నెట్ పని చేయదు. కంప్యూటర్లు హ్యాంగ్ అవుతున్నాయి. ఆధార్‌లో తప్పులు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులో వయసు తేడా కనిపించడంతోపాటు ఈకేవైసీ సమస్య వంటివి వెంటాడుతున్నాయి. దరఖాస్తులు సక్రమంగా ఉంటే మూడు దశల్లో వెరిఫికేషన్ పూర్తిచేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాల్సి ఉంది. వీఆర్వో, ఆర్ఐ, డీటీ ఇలా పరిశీలన పూర్తయ్యాక తహసీల్దార్ కార్డును మంజూరు చేస్తారు. ఇప్పటివరకు తహసీల్దార్ లాగిన్‌కు కార్డుదారుల వివరాలు రాలేదు. మరోవైపు ఈకేవైసీ లాగిన్ వీఆర్వో, డిజిటల్ అసిస్టెంటు, విలేజ్ సర్వేయర్, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఇచ్చారు. ఇంతమందికి ఇచ్చినా.. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఈకేవైసీ కోసం అవస్థలు తప్పడం లేదు. దీంతో క్షేత్ర స్థాయిలో సర్వర్ సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి ప్రకటించడంతో కొంతైనా సమస్య పరిష్కారం అవుతుందా అనేది వేచి చూడాలి.

ఈకేవైసీ కావడం లేదు



నేను కార్డు విభజన కోసం దరఖాస్తు చేశాను. ఈకేవైసీ కోసం పది రోజులుగా తిరుగుతున్నాను. అయినా వేలి ముద్రపడటం లేదు. రోజూ సచివాలయానికి వస్తున్నాను. ఎన్నాళ్లు పనులు మానుకొని తిరగాలి. అవకాశం ఇచ్చినట్లే ఇచ్చి ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

– ఎస్.వైకుంఠరావు, మఠంవీధి, నరసన్నపేట

సర్వర్ సమస్య అధికంగా ఉంది



రేషన్ కార్డుల్లో తప్పులు సవరణ, యూనిట్ల యాడింగ్, కార్డులు విభజన వంటి వాటి కోసం దరఖాస్తుదారులు తిరుగుతున్నారు. రోజూ నేను గమనిస్తున్నాను. సర్వర్ సమస్యే ప్రధానం. రాత్రి వరకు ఉన్నా సర్వర్ సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు దృష్టి సారించాలి. గత ప్రభుత్వ కాలంలో కొన్ని గంటల్లోనే రేషన్ కార్డులు మంజూరయ్యేవి.

– బి.ఎస్.శర్మ, వార్డు సభ్యుడు, కొత్తవీధి, నరసన్నపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



రేషన్ కార్డుల దరఖాస్తుల విషయంలో సర్వర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్య పరిష్కారం కావచ్చనే భావిస్తున్నాం. దరఖాస్తుల స్వీకరణ గడువు మరింత కాలం పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారులు ఓపిక పట్టాలి.

– రామకృష్ణ, డీటీ, నరసన్నపేట

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీఏ పీడీ సుధాకర్



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సుధాకర్

నరసన్నపేట: స్వయం శక్తి సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ బి.సుధాకర్ అన్నారు. నరసన్నపేటలోని భవానీపురంలో స్వయం శక్తి సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. రుణంగా తీసుకున్న ప్రతి పైసా అభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రతీ సంఘానికి యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. సంఘాల్లో ఉన్నవారు ఏ విధంగా జీవనోపాధి మెరుగుపరుచుకుంటారు, ఏ వ్యాపారం చేస్తారనేది వారి ఆసక్తి ఆధారంగా పేర్లు నమోదు చేస్తున్నామని, అటువంటి వారికి బ్యాంకుల నుంచి రుణంగా ఇప్పిస్తామన్నారు. గతంలో మాదిరిగా రుణాలు ఇవ్వడం జరగదన్నారు. విధిగా ప్రతీ స్వయం శక్తి సభ్యురాలు రుణం తీసుకుంటే ఆ మొత్తాన్ని జీవనోపాధికి వినియోగించాలన్నారు. ఏసీ కొండలరావు, ఏపీఎం అప్పలరామయ్య, సీసీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

హద్దులు గుర్తింపు



హద్దులు నిర్ణయిస్తున్న సర్వే సిబ్బంది

పొందూరు: మండలంలోని జోగన్నపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) రికార్డులు, రెవెన్యూ రికార్డుల మేరకు పీఏసీఎస్‌కు సంబంధించిన భూమిలో సరిహద్దులు గుర్తించామని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు గురువారం తెలిపారు. పాత సర్వే నంబర్, కొత్త సర్వే నంబర్ల ఆధారంగా హద్దులు నిర్ణయించామన్నారు. హద్దులు నిర్ణయించిన సమయంలో పలువురు ఆ భూమి తమదని, ఎలా హద్దులు నిర్ణయిస్తారని ప్రశ్నించారన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎటువంటి అభ్యంతరాలున్నా, రికార్డులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత రికార్డులను తహసీల్దార్ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ, సర్వేయర్ గణపతి, పీఏసీఎస్ సీఈఓ ఎర్నేని పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఐ బదిలీ

నరసన్నపేట: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జె.శ్రీనివాసరావుకు విశాఖపట్నం వీఆర్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో నరసన్నపేట సీఐగా మరడాన శ్రీనివాసరావును నియమించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావును నరసన్నపేటకు బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జె.శ్రీనివాసరావు నరసన్నపేటలో సీఐగా పని చేస్తున్నారు.

అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఈఓ రవికుమార్

పోలాకి: ప్రీ-ఎక్లాంప్సియాను (గర్భాధారణ సమయంలో వచ్చే సమస్య) సాధ్యమైనంత తొందరగా గుర్తించటం ద్వారా తల్లీబిడ్డలను రక్షించుకోచ్చని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనాథ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈఓ నల్లి రవికుమార్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా కవలలకు జన్మనిచ్చిన తల్లులతోపాటు, అధిక రక్తపోటు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నవారు, కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యాధులతో బాధపడుతున్నవారు, 20 ఏళ్ల కంటే తక్కువ వయస్సువారు, 35 కంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళల్లో ప్రీ-ఎక్లాంప్సియా బయటపడే అవకాశాలు ఉన్నాయన్నారు. అధిక తలనొప్పి, రక్తస్రావం, కాళ్లు, చేతులు వాపు, శ్వాసపీల్చుకోవటంలో ఇబ్బంది, తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయించుకోవటం ద్వారా దాదాపు అన్ని కేసులను ముందుగా గుర్తించవచ్చన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. సిబ్బంది సైతం ప్రత్యేకమైన ట్రాకింగ్ ద్వారా అటువంటి వారిని గుర్తించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా..!

- వసతి గృహాలు నిర్మించి.. నిరుపయోగంగా వదిలేశారు..
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- ఒక్కో భవనం రూ.2.10 కోట్లతో నిర్మాణం
- ఈ విద్యా సంవత్సరంలోనైనా తెరిచేనా?

ఎల్.ఎన్.పేట:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది బాలికలు చదువుకోవాలనే ఆశయంతోనే నియోజకవర్గంలోని మూడు మండలాల్లో బాలికల వసతి గృహాలను నిర్మించారు. ఈ భవనాలను 2023లోనే ప్రారంభించారు. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు రావటంతో ఈ భవనాలను వినియోగంలోకి తీసుకుని రాకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నప్పటికీ బాలికల వసతి గృహాల వినియోగంపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. అధికారులు, పాలకులు స్పందించి బాలికల వసతి గృహాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో

పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాల్లో బాలికల వసతి గృహాలను నిర్మించారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.2.10 కోట్ల నిధులు ఖర్చు చేసింది. ఈ భవనాల్లో కొత్తూరు భవనం బాలుర వసతి గృహంగా వినియోగిస్తున్నారు. కొత్తూరు బాలికల హాస్టల్లోకి వర్షం నీరు చేరటం, భవనం శిథిలం కావటంతో బాలికల కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉన్నందున బాలుర హాస్టల్‌గా వినియోగిస్తున్నారు. పాతపట్నం, ఎల్.ఎన్.పేట మండలాల్లో నిర్మించిన భవనాలు నిరుపయోగంగానే ఉన్నాయి.



ప్రారంభించి విడిచిపెట్టేసిన బాలికల హాస్టల్

ఈ ఏడాది అయినా...

జూన్ నెలలో మరో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. కనీసం ఈ విద్యా సంవత్సరానికి అయినా వీటిని వినియోగంలోకి తీసుకునిరావాలని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆయా మండల కేంద్రాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలు ఉండేందుకు వీలుగా వసతి గృహాలను నిర్మించారు.

వినియోగంలోకి తీసుకురావాలి



బాలికల కోసం నిర్మించిన హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలి. ప్రస్తుతం భవనం లోపల చీమలు పుట్టలు పెట్టడంతో పాటు చెద పురుగులు చేరాయి. దీనిని వినియోగంలోకి తీసుకువస్తే ప్రతీరోజు ఐదారు కిలో మీటర్ల దూరం నుంచి సైకిళ్లపై వచ్చి వెళుతున్న బాలికలకు ఈ భవనాలు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది.

–అశోక్ పాణిగ్రహి, ఉప సర్పంచ్, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



బాలికల వసతి గృహం వినియోగించడం సంబంధిత జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎందే తుది నిర్ణయం. భవన నిర్మాణం తరువాత వాటి తాళాలను జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంకు అప్పగించారు. భవన వినియోగం సమస్యను జిల్లా అధికారులకు నివేదిస్తాం. ఈ వసతి గృహం వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– కె చంద్రమౌళి, ఎంఈఓ-2, ఎల్.ఎన్.పేట

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



నరసన్నపేట: పెద్దపేటలోని శక్తి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హనుమాన్ జయంతి వేడుకలు ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పూజల్లో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: కేవీకే ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయ వద్ద అన్నప్రసాదాలను వడ్డిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: మడపాంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, తదితరులు



సారవకోట: హనుమాన్‌కి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమదాలవలస: గేదెలవానిపేట జంక్షన్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితుడు



మెళియాపుట్టి: రాజా వీధిలో పూజలందుకుంటున్న హనుమాన్ విగ్రహం



హిరమండలం: పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



బూర్జ: వావాంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



కొత్తూరు: పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: దంతపురి క్షేత్రంలో హనుమాన్ జయంతి వేడుకలు

నిర్మాణాలు నిలుపుదల చేయాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండలంలోని నేరడి రెవెన్యూ గ్రూప్ పరిధిలోని కుంచాలపేట సమీపంలో ఉన్న డీపట్టా భూమిలో జరుగుతున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని తహసీల్దార్ కె.బాలకృష్ణకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. డీ పట్టా భూమి దారుడు ఇదివరకే మృతి చెందాడన్నారు. ఆ భూమిని వారసులకు అప్పగించాలన్నారు. వారసులకు అప్పగించకపోతే ఆ భూమిని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలన్నారు. అధికారులు స్పందించి నిర్మాణాలపై విచారణ చేపట్టి నిలుపుదల చేయాన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, వనుము లక్ష్మీనారాయణ, అగతమూడి నాగేశ్వరరావు, ఎద్దు హరిదాసు, కృష్ణమోహన్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



ముఖలింగంను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని సింగన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల ముఖలింగం గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనను ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు గేదెల మనోజ్, కొంచాడ రాము, మజ్జి నర్సింగరావు, ఇప్పిలి తిరుపతిరావు, కింజరాపు ఆనందరావు, ముద్దాడ ఈశ్వరరావు, శంకర్, ఈశ్వరరావు, లోకేష్, తదితరులు ఉన్నారు.

మండల సమావేశం రేపు

సారవకోట: మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మోహన్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.